

# రంగయ్య తాతగారి [illegible] మహోత్సవం

కొడవటిగంటి కుటుంబరావు

రంగయ్యతాత లక్షాధికారి. పెద్ద వృద్ధుడు. మాననీయుడు. ఊళ్ళో అంతా ఆయన్ని భయభక్తులతో చూస్తారు. గొప్పగొప్పవాళ్ళంతా ఆయనయొక్క సద్గుణాలు మెచ్చుకుంటారు.

"ఈ ప్రాంతాల అడితప్పనివాడుంటే అది రంగయ్యతాతగారే!" అని డిప్టీ కలెక్టరుగారు ఎప్పుడూ అంటారు.

"ధనవంతుణ్ణని ఆయన కేమీ అతిశయం లేదు" అని శిరస్తాదారుగారు చాలా ఎన్నిక చేస్తారు.

"అతిథుల్ని సత్కరించటంలో ఆయన తరవాతే యెవరైనా!" అని మేజస్ట్రేటుగారు సాక్ష్యం ఇస్తారు.

"వితరణలో ఆయనచెయ్యి మహా పెద్దది!" అని లోకలుఫండు ఇంజనీరుగారు ఒప్పుకుంటారు.

ఇంతమంది ఇన్నివిధాల యెన్నిక చేసిన మనిషిమీద ఆయన సంతానమే [illegible] కష్టంచేసిన మాట నిజమే. రాను రాను కుర్రకారు మరీ అధోగతిపాలు కావటానికి ఇదే తార్కాణం!

ఆయనమీద కత్తికట్టి కుర్రవెధవ లేమైనా బాగుపడ్డారా అంటే అదీ కనిపించదేమో. ఒకడు తాతగారు బతికుండగానే ఆయనున్న ఊళ్ళోనే కాఫీహోటల్లో ప్లేట్లు అందిస్తూ, పరువు తక్కువవాళ్ళ ఇళ్ళల్లో మకాం పెట్టాడాయె. ఇంకో మనవడు కంపెనీవాళ్ళకి హార్మోనియం వాయిస్తున్నాడాయె. మరొకడు కులగోత్రాలులేని వితంతువును పెళ్ళాడి ఆ మనిషిచేత పోషింపబడుతున్నాడాయె. ఇంకో అప్రయోజకుడు ఊళ్ళో ఉన్న మోటార్లూ, ఆయిల్ ఇంజన్లూ బాగుచేస్తూ మసిగుడ్డలతో తిరుగుతాడాయె.

ఇదేనా తిరుగుబాటు? తిరుగుబాటంటే మొహంమీద కోపం వచ్చి ముక్కు కోసేసుకోవటమేనా?

[illegible]

ఒకణ్ణి పట్టుకుని నాలుగు ముక్కలూ రూడించి అడిగాను.

"నువు చాల పొరపాటు పడు తున్నావు" అన్నాడు వాడు. "మేం తిరుగుబాటయితే చేశాంగాని మొహంమీది కోపంతో ముక్కు కోసుకున్నమాట అబద్ధం. మాపిధి మేం నిర్వర్తిస్తున్నాం. మా ఆత్మలని మేం రక్షించుకోవటమే కాకుండా, మా పొట్టలు మేం పోసు కుంటూ ఇంతకాలానికి జీవితంలో ఆనంద మేమిటో తెలిసికోగలిగాం.

"నా మటుకు నేను కాఫీహోటల్లో పనిచేస్తాను. శరీరానికి తగినంత చాకిరి పొట్టకు కడుపునిండా తిండి. నాపని అయిపోగనె హాయిగా వైట్‌రోజ్ సబ్బు పెట్టి వేణ్ణీళ్ళ స్నానం చేసి, మంచి ఇస్త్రీ మడతలు వేసుకుని, జుట్టుకి వాసననూనె రాచి మంచి సిగిరెట్టు వెలిగించి ఏ సిని మాకో పోతాను. ఈ ఊళ్ళో ఏ సినిమాకు గాని, నాటకానికి గాని, సర్కసుకు గాని నాకు టిక్కెట్టక్కర్లేదు. పన్నెండింటిదాకా పచార్లు కొట్టివచ్చి పడుకుంటే వెర్రినిద్ర పడుతుంది. కలకూడా రాదు. మళ్ళీ టంచనుగా అయిదింటికల్లా లేచి పనిలో జొరబడతాను.

"నాకేమిటి లోటు? వెనకటి ఆశ్ర మంలో నాకేమీ ఉండేదికాదు—అసం తృప్తి తప్ప చేసేటందుకు పనీ లేదు. తినేటందుకు తిండీ లేదు. కాఫీకి అర్ధణా కావాలంటే రంగయ్యతాతకి తెలియాలి. సిగిరెట్టు కొనుక్కుందామంటే అసలే లేదు. ఎప్పుడూ సిగరెట్లు ముష్టే గద! దరిద్రం మందా? రంగయ్య మనమడి కన్న దరిద్రుడు లేడుగద! అందరికీ నేనంటే హడలే—ఎక్కడ సిగరెట్టడుగు తానో, ఇప్పించమంటానో అని ఇత రత్రా నేనంటే ఇష్టమైన వాళ్ళకూడా ఈ మూలంగా నేనంటే భయం! పేరుకు మటుకు రంగయ్య మనమడు! లక్షాధి కార్ల బిడ్డ . దొంగతనాలు చేసేవాణ్ణి! ఇంటిడబ్బే అనుకో! అయినా దొంగ తనానికి పాల్పడిం తరవాత నా మొహం దొంగమొహమే!....ఏ విధంగా చూసినా, నన్ను చూస్తే నాకే ఏవగింపుగా ఉండేది. రాత్రిపూట నిద్రపట్టేది కాదు. పడితే పీడకల లొచ్చేవి... పైగా రంగయ్యతాత ఆజమాయిషీ! సినిమాకు పోవటానికి లేదు. పొద్దూన అరగంటలోపల ఇంటికి రావాలి. తొమ్మిదింటికల్లా నిద్రపోవాలి. డ్రిల్లూ!

"ఇంత ప్రాణాలు బిగబట్టుకున్నా ఎప్పుడో అప్పుడు రంగయ్యతాత గౌర వానికి హానికలగనే కలిగేది... సిగిరెట్టు కాలుస్తుండగా ఎవడో పీనుగ చూడనే చూసేవాడు. ముసలాడికి చెప్పనే చెప్పే వాడు! ఇప్పుడే వెధవా చెప్పడు. కావ లిస్తే ముసలాడి మొహానే పొగ విడు స్తాను....!

"మిగిలినవాళ్ళూ నా మాదిరిగా నే బాగుపడిపోయినారు గాని చెడిపోలేదు.

మావా డొకడు మంచి ఇంజనీరు. వాడికి డిగ్రీలేదు గాని ఉంటే వేలకువేలు సంపాదించును. ఎంత కొత్త యంత్రమైనా పట్టుకురా — నిమిషంలో అమర్చుతాడు. వాడి లైనులో వాడికి గొప్ప పేరు వస్తున్నది. చూస్తూ ఉండు. వాడెంత పైకొస్తాడో!....

"అవును, ఇంకోడు సంగీతంలో పడ్డాడు. వాడిచేతుల్లో సుఖం ఉంది. ఆమాట నేననటం కాదు—మంచి పాటగాళ్ళే అన్నారు. రంగయ్య తాతయ్య మీద తిరగబడిం తరవాత ఆరునెలల్లో వాడు మంచి హార్మోనిస్టయి కూచున్నాడు. లేనట్టయితే గోళ్ల గిల్లుకుంటూ కూర్చుండ వలసినవాడు. వాణ్ణి సినిమావాళ్లు తీసుకుంటున్నారు. నెలకు నూటయాభై ఇస్తారుట. రంగయ్య తాత వాడికి నెలకి నూటయాభై దమ్మిడీలు కూడా ఇచ్చిన పాపాన పోలేదు....

"వెధవ ముండని పెళ్లాడాడని అందరూ వాడిమీద పడి ఏడుస్తారు. ఆవిడచేసిన మహాపాపం ఏమీలేదు. బతికుండగానే మొగుణ్ణి వదిలేసింది. వాడి సంగతి అందరికీ తెలుసు. పరువైన ఆడది ఎవతెకూడా వాడితో కాపరం చెయ్యదు. వాడి ఖర్మాన వాడు చచ్చాడు. ఆ తరవాత మావాణ్ణి పెళ్ళాడింది. పదెకరాల భూవసతి ఉంది. మావాణ్ణి కూచో పెట్టి మేపుతున్నది. అది చూసి ఓర్వలేని వాళ్లు ఆవిణ్ణి పీటి దంటారు. పీటిదైతే లేవదీసుకు పోవటాని కెవడైనా ప్రయత్నించడేం? రెండు నగలున్నదాన్నే వదలరుకదా. ఆ మనిషి చాలా మంచిది. చచ్చినా ఇంకోడి కేసి చూడదు. ఆమాట ఒప్పుకోవటం ఇష్టంలేక అసూయ కొద్దీ అడ్డమైన కూతలూ కూస్తారు. నా ఉద్దేశం — అటువంటి భార్య దొరికిన వాడెవడైనా అదృష్టవంతుడనే!....

అంతా విన్నాను.

"ఇదంతా కాదనను గాని, అబ్బాయీ, నువొక పొరపాటు పడుతున్నావు. జీవితమంటే కడుపునిండా తిండీ, ఇష్టమైన వ్యాపకమూ, అనువైన పెళ్ళామూ— ఇంతే ననుకుంటున్నావు. ఇంతకన్న విలువైన విషయాలున్నై. మాటవరసకి చెబుతున్నాను. మీ తాతగారు ఆడితప్పని మనిషి. పేరుపడ్డ దాత. ఆతిథ్యంఇవ్వటంలో అసమానుడైన గృహస్తు—!"

నామాట సాంతం కానివ్వకుండానే రంగయ్య మనమడు గట్టిగానవ్వి, "ఎవరు చెప్పారు నీకీ అబద్ధాలు?" అన్నాడు.

"డిప్టీ కలెక్టరుగారూ, ఇంజనీరుగారూ అబద్ధాలాడుతారా. శిరస్తాదారుగారు కూడానా....ఆయన పరువు ప్రతిష్ఠల విలువ గ్రహించక పోబట్టే మీరంతా ఇట్లా చెల్లాచెదరై పోయినారు. ఇప్పటికైనా మీరు పశ్చాత్తాపపడి తిరిగివస్తే ఆయన ముసలిప్రాణం—ఏక్షణాన హరీ అంటుందో మరి!—చాలా సంతోషిస్తుంది" అన్నాను.

రంగయ్య మనమడు మళ్ళీ విరగబడి నవ్వి. "మా తాతకి పరువనేది ఉందని నువ్వనుకుంటున్నావు. ఉండొచ్చు; డిప్టీ కలెక్టరుగారి దగ్గిరా శిరస్తాదారుగారి దగ్గిరా ఆయన ప్రవర్తన సరిగానే ఉండొచ్చు. కాని మా తాతకి నిజంగా పరువూ పాడూ ఏమీలేదు. పరువున్నవాడు మూడేళ్ళనాటి పాతగుడ్డలు పిగిలినందుకు చాకలాడికి డబ్బు విరగ్గోస్తాడా? పంటలు పండక రైతులు అలో లక్ష్మణా అని ఏడుస్తుంటే బకాయిపడ్డ ధాన్యానికి పత్రాలు రాయించి పుచ్చుకుంటాడా? కష్టసమయంలో ఉండిన తన నౌకరీలోకి రాలేకపోయిన కూలి వాళ్ళని పనిలోనించి తియ్యటమేగాక ఊళ్లో వాడి కెవరూ పని ఇవ్వకుండా చేసి ఊళ్ళోనించి సాగనంపుతాడా? ఈ ఊరి అలగాజనంలో మా తాత చస్తే పండుగ చేసుకోనివాళ్లుంటారా? దోపిడిచేసే దొంగ వెధవలికి పరువు ప్రతిష్ఠ లేమిటి? కష్టపడి పని చేసుకునేవాడికి పరువు ప్రతిష్ఠలూ మానాభిమానాలు గాని!

"నన్ను చూడరాదూ? నేను చేసుకునే పని దాయను. నా సిగిరెట్లు దాయను. అఖరికి నాముండనుకూడా దాయను కాని రంగయ్య నాకు తాత అనేది ఒకటే దాస్తాను. అదే నాకు తలవంపులు!.... నేనే కాదు. మా అందరికీ అంతే! మా పానకంలో పుడక ఆ ఒక్క ముసలాడే! ఆయన పరువు ప్రతిష్ఠల సంగతి నాకు చెప్పావు గనక నా పరువు ప్రతిష్ఠల సంగతి ఆయనికి చెప్పు. ఆయన్ని త్వరగా చచ్చిపొమ్మను. ఆయన ఒక్కడే,

మందిమి సంతోషిస్తాం....ఆఖరుకు డిప్టీ కలెక్టరుగారయినా ఆటే ఏడుస్తా రను కోను!"

ఈ మాటలు వింటుంటే నాకేమనాలో తెలీలేదు.

"అబ్బాయీ, ఇదంతా నేను మీ అందరి శ్రేయస్సు కోరే చెప్పాను. గనుక మరోవిధంగా అనుకోకు! మీరంతా నిజం గానే సుఖంగా ఉంటే నేను మరేమీ మాట్లాడను. నా ఉద్దేశంకూడా మీరూ మీరూ సుఖంగా ఉండాలనే .... కాని మరొక్క విషయం అడుగుతాను చెప్పు; మీరంతా ఈ విధంగా నిరాధారపు జీవితాలు జీవిస్తున్నారు కదా; మీలో ఎవడైనా రెండు రోజులు పడక వేస్తే మీ గతేమిటి? అదైనా ఆలోచించారా?" అన్నాను.

రంగయ్య మనమడు జేబులోనించి అయిదురూపాయిల నోటొకటి తీసి. "ఆలోచించేటందు కేముందీ ఇదిగో. ఈ అయిదురూపాయలూ మావాడి కొకడికి మనిఆర్డరు చెయ్యబోతున్నాను. వాడేదో ఖర్చులో ఉన్నానని రాశాడు. మిగిలిన వాళ్లకూడా తలాకాస్తా పంపుతారు. మాలో ఏ ఒక్కణ్ణీ మిగిలినవాళ్లు చూస్తూ చూస్తూ చావనివ్వం....అసలురహస్యం పీ కర్థం కాలేదు. మేం రంగయ్యతాతతో ఊరికే పోట్లాడి ఇవతలికి రాలేదు. శాస్త్రీయంగా ఆ ముసలాడి మీద తిరుగుబాటు చేశాం!" అన్నాడు.

"వెళ్ళరా, బాబూ! మీరే గెలిచారు, సందేహం లేదు" అంటూ నా దారి